# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 08-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశంలో అవినీతి నిర్మూలనకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- ❖ జమ్మూ-కశ్మీర్ లో కేంద్రం రద్దు చేసిన 370వ అధికరణను దేశంలోని ఏ శక్తి పునరుద్ధరించలేదని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.
- ❖ భారత్, ఆసియాన్ దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తులుగా మారనున్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.
- ❖ రేపు పదవీ విరమణ చేయనున్న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డి. వై. చంద్రచూడ్‌కు ధర్మాసనం ఘనంగా వీడ్కోలు పలికింది.
- ❖ జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని విధిగా పాటించాలని భారత ఎన్నికల సంఘం అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేసింది.

=======================

అవినీతి అనేది ఒక వ్యాధి వంటిదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఆధ్వర్యంలో జరిగిన “విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ -2024” సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి మాట్లాడుతూ… అవినీతిని సమూలంగా తొలగించవలసిన అవసరం ఉందన్నారు. అవినీతి నిర్మూలనకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని పేర్కొంటూ… డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ స్కీమ్, ఈ-మార్కెట్ ప్లేస్, ఎకనామిక్ అఫెండర్స్ యాక్ట్ లను ఉదహరించారు. ఏ సమాజానికైనా విశ్వాసమే పునాది అని, అయితే సమాజంలో విశ్వాసాన్ని అవినీతి క్షీణింపజేస్తుందని వ్యాఖ్యానించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా విజిలెన్స్ అవగాహనా వారోత్సవాలను నిర్వహిస్తున్నామని రాష్ట్రపతి పేర్కొన్నారు.

(వాయిస్ 37 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

అభివృద్ధి వేగాన్ని పెంచేందుకు బీజేపీ, శివసేన, ఎన్సీపీ పార్టీలతో కూడిన మహాయుతి కూటమిని గెలిపించాలని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ మహారాష్ట్ర ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గిరిజనులు అధికంగా నివసించే ధూలే నుండి ఈరోజు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. రాష్ట్రంలో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను మహా వికాస్ అఘాడి (MVA) రద్దు చేస్తుందన్నారు. ఎన్డీయే కూటమిని మహారాష్ట్ర విశ్వసిస్తోందని, వచ్చే ఎన్నికల్లో మహాయుతి కూటమికి ఇక్కడి ప్రజలు ఓటు వేస్తారని చెప్పారు. మహారాష్ట్రకు అవసరమైన సుపరిపాలనను మహాయుతి ప్రభుత్వం మాత్రమే అందించగలదని అన్నారు. కశ్మీర్ అంశాన్ని ప్రస్తావిస్తూ... జమ్మూకశ్మీర్ లో కేంద్రం రద్దు చేసిన 370వ అధికరణను దేశంలోని ఏ శక్తి పునరుద్ధరించలేదని నరేంద్రమోదీ స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, ఆగ్నేయ ఆసియా దేశాల సంఘం (ఆసియాన్) దేశాల మధ్య  పరస్పర సహకారం ఎంతో ఆవశ్యకమని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఉద్ఘాటించారు. సింగపూర్‌లో ఈరోజు జరిగిన ఆసియాన్ - ఇండియా నెట్‌వర్క్ ఆఫ్ థింక్ - ట్యాంక్స్ 8వ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భారత్ - ఆసియాన్ దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన చోదక శక్తులుగా మారనున్నాయన్నారు. సమకాలీన సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్, ఆసియాన్ దేశాల మధ్య సహకారం కీలకమని వ్యాఖ్యానించారు. ఈ దేశాల భాగస్వామ్య ప్రాంతాలలో రాజకీయ సంక్లిష్టతలను సమిష్టిగా పరిష్కరించాల్సి ఉందన్నారు. భారత్, సింగపూర్ దేశాల మధ్య ఇటీవల జరిగిన చర్చల్లో డిజిటల్, ఎనర్జీ కనెక్టివిటీ ప్రధానాంశంగా ఉందని పేర్కొంటూ....

(వాయిస్ 34 సెకన్లు)

కాగా... ఆగ్నేయ ఆసియా దేశాల సంఘం (ఆసియాన్)లో ఇండోనేషియా, సింగపూర్, ఫిలిప్పీన్స్, మలేషియా, బ్రూనై, థాయిలాండ్, కంబోడియా, లావోస్, మయన్మార్, వియత్నాం దేశాలు ఉన్నాయి.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీ.వై. చంద్రచూడ్ రేపు పదవీ విరమణ చేయనున్నారు. ఈరోజు ఆయనకు చివరి పనిదినం కావడంతో సుప్రీం కోర్టు ధర్మాసనం ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేపటి నుంచి సర్వోన్నత న్యాయస్థానం నుంచి తీర్పులు ఇవ్వలేనన్నారు. వృత్తిపరంగా పూర్తి సంతృప్తిగా ఉన్నట్టు చెప్పారు. కాగా... సుప్రీం కోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా నియమితులలైన జస్టిస్ సంజీవ్ ఖన్నా ఈ నెల 11వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణం చేయించనున్నారు. వచ్చే సంవత్సరం మే 13 వరకు ఆయన సీజేఐగా కొనసాగనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

జార్ఖండ్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అన్ని పార్టీ వారు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని విధిగా పాటించాలని భారత ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కె.రవికుమార్ రాంచీలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై.. తప్పుడు వాగ్దానాలతో ఓటర్లను తప్పుదారి పట్టించడం వంటి వాటిని నివారించాలన్నారు. వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉండాలన్నారు. రాజకీయ పార్టీలు, ఇతర భాగస్వాములతో విస్తృత సంప్రదింపులు జరిపి, ఎన్నికల సంఘం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను రూపొందించిందని, దానిని అనుసరించాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలకు ఉందని ఆయన స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్ పూజా ఉత్సవాలు ముగిశాక, సొంత ప్రాంతాలకు తిరిగి వెళ్ళే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని భారతీయ రైల్వే 500కు పైగా ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. ప్రత్యేక రైళ్ళను ఈరోజు నుంచి నడుపుతున్నామని రైల్వే బోర్డు ప్రకటించింది. అధిక రద్దీ దృష్ట్యా ఈరోజు 164, రేపు 160, ఈ నెల 10వ తేదీన 161, 11వ తేదీన 155 ప్రత్యేక రైళ్లను నడపాలని భారతీయ రైల్వే నిర్ణయించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో 'యోగ మిత్రలను నియమించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అన్ని పాఠశాలల్లో  యోగమిత్ర లను నియమించాలని ప్రభుత్వాన్ని ఆదేశించలేమని, ఇవి విధానపరమైన అంశమని పేర్కొంది. యోగా... సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుందనే విషయంలో ఎటువంటి సందేహం లేదని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. అయితే... పాఠశాలల్లో యోగామిత్ర లను నియమించడం ప్రభుత్వం చేయవలసినదని ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ అన్నారు.

న్యాయమూర్తులు J.B. పర్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం, వ్యాజ్యాన్ని ఉపసంహరించుకోవచ్చని సూచించింది. అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ అనే న్యాయవాది.. అన్ని పాఠశాలల్లో 'యోగ మిత్ర' నియామకం 6 నుండి 14 సంవత్సరాల పిల్లల సమగ్ర అభివృద్ధికి ప్రయోజనకరంగా ఉంటుందని, అలాగే... వారి జ్ఞానం, సామర్థ్యం, ప్రతిభను పెంపొందిస్తుందని వ్యాజ్యంలో వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్‌లో ఛాత్ పూజ భక్తి శ్రద్ధలతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ పండుగ సందర్భంగా భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో నీటిలో నిలబడి ఉదయించే సూర్యుడికి అర్ఘ్యం ఇచ్చారు. ఈ రోజు ఉదయం భక్తులు సూర్య భగవానుడికి అర్ఘ్యం ఇవ్వడంతో 4 రోజుల ఉపవాస దీక్ష ముగిసింది. ఉదయించే సూర్యుడిని దర్శించుకోవడానికి ఈ ఉదయం రాష్ట్ర వ్యాప్తం నలుమూలల నుండి ప్రత్యేకించి తూర్పు ప్రాంతంలోని ప్రజలు నదుల ఒడ్డుకు వేల సంఖ్యలో తరలివచ్చారు. ఘాట్ల వద్ద అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశాభివృద్ధి కోసం తనను తాను అంకితం చేసుకొన్న గొప్ప వ్యక్తి లాల్‌కృష్ణ అద్వానీ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. అద్వానీ 97 జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అద్వానీ దేశంలో అత్యంత ప్రశంసనీయమైన రాజనీతిజ్ఞుడని, ఆయన తెలివి, అంతర్ దృష్టిని దేశం ఎల్లప్పుడూ గౌరవిస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా ఈ రోజు వైద్య పరికరాల పరిశ్రమలను బలోపేతం చేసే ఒక పథకాన్ని ప్రారంభించారు. పరిశ్రమల అభివృద్ధి లక్ష్యంగా రూపొందించిన ఈ సమగ్ర పథకం వైద్య పరికరాలు, ఉపకరణాల తయారీ, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధి తదితర అంశాల్లో పరిశ్రమలకు మద్దతుగా నిలుస్తుంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... ఈ పథకం భారత్‌ను స్వావలంబన దిశగా తీర్చిదిద్దడంలో గొప్ప పురోగతి అని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =